క్లుప్తంగా

ఎర్రగట్టుకు దారి ఏర్పాటు



వనపర్తి రూరల్: మండలంలోని ఉమ్మడి కాశీం నగర్ గ్రామంలోని ఎర్రగట్టుపై కొనసాగే ఆంజన్నస్వామి జాతరకు వస్తున్న భక్తులు గట్టు పైకి వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు యువ నాయకుడు ఏర్వ సాయిప్రసాద్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన భక్తులకు ఇబ్బంది రాకుండా గురువారం సొంత ఖర్చులతో గట్టుపైకి వెళ్లడానికి రోడ్డు బాగుచేయించారు. రోడ్డుకు ఇరు వైపులా పొక్లెయిన్‌తో పిచ్చి మొక్కలను తొలగించారు.

ఈదమ్మ జాతరకు బందోబస్తు కల్పించాలి



పాన్‌గల్: మండల కేంద్రంలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి నిర్వహించే ఈదమ్మ జాతరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈదమ్మ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఎస్ఐ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. జాతర ప్రశాంతంగా జరిగేలా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పూజారి నాగన్న, కమిటీ సభ్యులు కుమ్మరి బాలస్వామి, బుచ్చయ్య, నాగేశ్వర్, ఆనందం, వెంకటయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు నడిపించండి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి గ్రామం మీదుగా ఆత్మకూర్‌కు వనపర్తికి వెళ్లే ఆర్టీసీ ఆర్డినరీ బస్సులను నడిపించాలని మహబూబ్‌నగర్ ఆర్ఎంకు కాంగ్రెస్ నాయకులు అక్కల మహదేవన్‌గౌడ్ గురువారం వినతిపత్రం సమర్పించారు. ఆత్మకూర్, వనపర్తి, కొత్తకోటలో చదువుకునే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల కొత్తపల్లి గ్రామం వరకు కాలినడకన వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని బస్సును నడిపించాలని కోరారు.

పాఠశాలకు గ్రీన్‌బోర్డ్‌ల అందజేత

అమరచింత: మండలంలోని సింగపేట ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయురాలు అనురాధ, దివాంజీ వెంకట్‌నరసింహ దంపతులు రెండు గ్రీన్ బోర్డులను అందించారు. ఈమేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి దాతలను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలకు చేయూత ఇస్తూ పేద విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



రాణి (ఫైల్)

కొత్తకోట రూరల్: దైవ దర్శనానికి వెళ్తున్నామని ఇంట్లో చెప్పి పిల్లలతో కలిసి వెళ్లిన తల్లి వెళ్లి ఏడు రోజులుగా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన ఎరుకలి శంకరమ్మ, వెంకటన్న దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూతురు రాణికి ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. రాణి భర్త రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాణికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాణి భర్త చనిపోయినప్పటి నుండి తల్లిదండ్రుల వద్దే కొత్తకోటలో నివాసం ఉంటుంది. రాణి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈనెల 23న ఉదయం శ్రీశైలం వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిపోయింది. ఇంటి నుంచి వెళ్లిన తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉండటంతో బంధువుల వద్ద ఆరా తీసిన ఆచూకీ లభించకపోవడంతో రాణి తల్లి శంకరమ్మ గురువారం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఆనంద్ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బస్టాండ్‌లో చోరీ

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం మహిళ బ్యాగ్‌లోని పర్స్ ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బా ధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేశామని పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపా రు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూ ల్ జిల్లాకు చెందిన పక్రునిసాబేగం వనపర్తిలో ని పుట్టింటికి వచ్చి గురువారం క ర్నూల్‌కు వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చింది. ఆమె బ్యాగులో ఉన్న పర్స్‌ను గుర్తు తెలియని వ్య క్తులు అపహరించారు. పర్సులో 4 గ్రాముల బంగారం, మొబైల్ ఫోన్ ఉన్నాయని బాధితురాలు పక్రునిసాబేగం ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు రాబట్టాలి



ఆత్మకూర్‌లో విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే సొంత నిధులతో డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్ అందించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో రూ.లక్షల ఫీజులు వసూలు చేసి వారికి బోధిస్తున్న పాఠ్యపుస్తకాల కంటే మెరుగైన మెటీరియల్‌ను నిష్ణాతుల పర్యవేక్షణలో తయారు చేయించామన్నారు. రాష్ట్రంలోనే మక్తల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించే విధంగా సులభతర పద్ధతులతో టూడీ, త్రీడీ యానిమేషన్స్, క్యూఆర్‌కోడ్‌తో కూడిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని 3421 మంది విద్యార్థులకు రూ.30లక్షలతో మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. సెల్‌ఫోన్ల ద్వారా, అలాగే ఆన్‌డ్రైడ్ టీవీలకు కనెక్ట్ చేసి పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం జూరాల గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థిని అనురాధ కాలితో రాస్తున్న తీరును పరిశీలించి నగదును అందించి అభినందించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, బాలకిష్టన్న, మచ్చేందర్‌గౌడ్, నాగేష్, మణివర్ధన్‌రెడ్డి, గంగ, షంశీర్, విజయలక్ష్మి, జుబేర్, ఎంఈఓ బాలరాజు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

జిల్లా ఉత్తమ సీఐగా అవార్డును అందుకున్న ఆత్మకూర్ సీఐ శివకుమార్‌ను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎక్సైజ్ అధికారి చాయపత్త శ్రీనివాసులు, ఎస్ఐ నరేందర్, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వార్షిక పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని అన్నారం, మల్లాయిపల్లి ప్రాథమిక పాఠశాలలు, చింతకుంట, కేతేపల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు.

అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని ముందలితండా, వెనికితండా, బక్కతండాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి పాఠాలు చదివించడం, రాయించడం చేయించి వారిలో అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం పాఠశాలల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. విద్యార్థులతో కలిసి పోయి వారికి పఠనా సక్తిని కలిగించాలన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు



పెబ్బేరు రూరల్: పట్టణంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో గురువారం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ ఎడ్యుకేషన్, ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా పాఠశాల కరెస్పాండెంట్ లావణ్య మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా ద్విచక్ర వాహనాన్ని నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పట్టణ పురవీధుల వెంబడి ర్యాలీ నిర్వహించి ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు.

కనీస వేతనం ఇవ్వాలి

ఆత్మకూర్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు సమస్యలన్నింటిని పరిష్కరించాలని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు హన్మంతు, జిల్లా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా నేటికీ అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో మక్బూల్, సత్యన్న, ఇస్మాయిల్, కృష్ణ, మహమ్మద్, వెంకటన్న, మైనొద్దీన్, రాధ, రేణుక, గఫూర్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఆలయం ఎదుట మద్యం సీసాలు



గోపాల్‌పేట: రేవల్లి మండలం తల్పునూరులోని ఆలయంలో గురువారం ఉదయం ఖాళీ మద్యం సీసాలు కనిపించడంతో గ్రామంలో కలకలం రేగింది. గురువారం ఉదయం ఆలయం ముందు ఖాళీ మద్యం సీసాలు ఉండటాన్ని చూసిన గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై గ్రామ పెద్దలు రేవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశామని ఎస్ఐ రాము తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించామని గుడి ముందు మూడు ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ ప్యాకెట్లు, ఇతర పొట్లాలు గుర్తించామన్నారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు

పాన్‌గల్: ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని కేతేపల్లిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలపై తెలుసుకోవాలన్నారు. తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు, ఆధార్ వివరాలను చెప్పొద్దని సూచించారు. బ్యాంకు సేవలు, చిన్నతనం నుంచే బడ్జెట్, ఆర్థిక ప్రణాళికపై అవగాహన కలిగి ఉండాలని ఐకేపీ ఏపీఎం సక్రూనాయక్ అన్నారు. ఇన్సూరెన్స్, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై గురించి ట్రైనర్ విజయ్ వివరించారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్, రిసోర్స్‌పర్సన్లు అశోక్, శేఖర్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ క్రాంతి, పంచాయతీ కార్యదర్శి పరశురాం, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి: బీఆర్‌ఎస్



కొత్తకోటలో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తకోట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అంజదేశారు. అంతకు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందని దుయ్యబట్టారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పట్టణాలు అభివృద్ధి చెందాయని, కాంగ్రెస్ ప్రచార ఆర్భాటాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా నేటికీ పట్టణంలో ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, కొండారెడ్డి, గాడీల ప్రశాంత్, బాబురెడ్డి, అయ్యన్న, ఆకుల శ్రీనివాస్, కటిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 420 రోజులు పాలన పూర్తి

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలకు నేటితో 420 రోజులు పూర్తయ్యాయని, అయినా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఉంచారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు చిన్న అంజనేయులుగౌడు, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, క్యామ వెంకటయ్య, బుచ్చిబాబుగౌడ్, బాల్‌రెడ్డి, నాగులు, రాములు, ప్రతాప్, చెన్నయ్య, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో భక్తిశ్రద్ధలతో ప్రతి ఏడాది చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు.

శ్రీకృష్ణ ఆలయానికి విరాళం

కొత్తకోట: పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు కొత్తకోటకు చెందిన విశ్వేశ్వర్ వారి తల్లిదండ్రులు పోగాకు బసమ్మ, జంబులింగం జ్ఞాపకార్థం రూ.3,00,116లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

అభయాంజనేయస్వామి ఆలయానికి..

ఆత్మకూర్: శ్రీఅభయాంజనేయ ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్ తెలిపారు. గురువారం పిన్నంచర్లలో బీజేపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నగదును సేకరించి ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డికి అందించామన్నారు. నీలారెడ్డి, శివశంకర్, నర్సింహ, మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి ఉన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో పయనిద్దాం



గోపాల్‌పేటలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ప్రతి ఒక్కరూ మహాత్ముడి అడుగుజాడల్లో నడిచి సమాజ అభ్యున్నతికి కృషిచేద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మహాత్ముడి వర్ధంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో బాపూజీ వ్యక్తిత్వం, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు.

■ అమరచింత మండల కేంద్రంలో గల బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, అయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, తౌఫిక్, వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమంతునాయక్, పోసిగిగారి విష్ణు, శ్యాం, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

■ కొత్తకోట పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, బీచుపల్లి, మేస్త్రీ శ్రీనివాసులు, పీజే బాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, జేఎం మిషేక్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ పెబ్బేరు మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గాంధీజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మొహినోద్దీన్, ఈశ్వర్‌రెడ్డి, బాలమ్మ, రమేష్, ఆంజనేయులు, శివాని, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

■ వనపర్తి మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటేశ్వరగుప్తా, మాజీ సర్పంచ్ భాను ప్రకాష్, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, గిరిరాజాచారి, సంజీవయ్య, వరదాచారి, రుద్రమదేవి, రవి, మహమ్మద్, శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, జితేందర్, సుచరిత, శోభ, శిరీష, స్వరూప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

■ ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద కాంగ్రెస్ నాయకులు గాంధీజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు డాక్టర్ నరేందర్‌గౌడు, ఆగారం ప్రకాష్, క్యామ బాలరాజు, మధు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ మదనాపురం మండల కేంద్రంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, వడ్డెకృష్ణ, వెంకట్ నారాయణ, టీసీ నాగన్న యాదవ్, ఆవుల రాఘవేంద్ర, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ గోపాల్‌పేట మండల కేంద్రం, రేవల్లి మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహాలకు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

■ బుద్దారంలో బీఆర్‌ఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఏఓ అరవింద్

అమరచింత: రైతులు రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి సేంద్రియ ఎరువులను వినియోగించి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అరవింద్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో గురువారం జాతీయ ఆహార భద్రతపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఫాస్ఫేట్ సాల్యుబ్లైజింగ్ బ్యాక్టీరియా, బయో ఫర్టిలైజర్ వాడకంతో కలిగే ఉపయోగాల గురించి వివరించారు. రుణమాఫీ కానీ రైతులకు త్వరలోనే రుణమాఫీ అవుతుందన్నారు. రైతుభరోసా, రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణ, రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి జీవనరుల వాడకం, పీఎం కిసాన్ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ఉపాధ్యాయురాలికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ

అమరచింత: గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్ఐ సురేష్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో గురువారం ప్రజలకు సీసీ కెమెరాల అవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వంద మంది పోలీసులు చేసే పని ఒక్క సీసీ కెమెరాతో సాధ్యమవుతుందన్నారు. దీంతో గ్రామస్తులు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛందంగా రూ.లక్ష అందించేందుకు ముందుకు వచ్చారన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మండలంలోని మస్తీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు తన సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఫోన్‌ను రికవరీ చేసి బాధిత ఉపాధ్యాయురాలికి అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



పాన్‌గల్‌లో బడిబయట గుర్తించిన విద్యార్థులతో సీఆర్పీలు

పాన్‌గల్: బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని సీఆర్పీలు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా గురువారం పాన్‌గల్‌లో బడిబయట ఉన్న ముగ్గురు విద్యార్థులు సాయిచరణ్, శివకుమార్, శివ ను గుర్తించి బడిలో చేర్పించాలని సీఆర్పీలు వారి తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరిని బడికి పంపించాలని, వారిచే పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. పిల్లలు చదువుకుంటే కలిగే లాభాలు, ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, ఐఈఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వనపర్తి టౌన్: పట్టణంలోని 33/11 కేవీ వనపర్తి ఉపకేంద్రంలో మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8:30 నుంచి 10:30 వరకు బాలానగర్, పాత బజార్, హరిజనవాడ, గాంధీనగర్, గాంధీ చౌక్, రాయిగడ్డ కాలనీ, శ్వేతా నగర్, తిరుమల కాలనీ, పానగల్ రోడ్, మెట్టుపల్లి, నందిమల్ల గడ్డ, కమలానగర్, రాంనగర్ కాలనీ, బాలాజీ నగర్, శారదా నగర్, బ్రహ్మంగారి వీధి, చిట్యాల రోడ్డు లోని చింతల హనుమాన్ టెంపుల్, ర్యాంకర్ స్కూల్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజయ్యగౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు

కొత్తకోట: ఎస్‌డీఎఫ్ ద్వారా కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు దేవరకద్ర నియోజవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రజక కమ్యూనిటీ భవనానికి రూ.5 లక్షలు, యాదవ కమ్యూనిటీ భవనానికి రూ.4 లక్షలు, సగర సంఘం భవన నిర్మాణానికి రూ.9 లక్షలు, వాల్మీకి కమ్యూనిటీ భవనానికి రూ.5 లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

చీర్కపల్లి విద్యార్థుల ప్రతిభ

గోపాల్‌పేట: ఏదుల మండల కేంద్రంలో విద్యార్థులకు ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులపై నిర్వహించిన ట్యాలెంట్ టెస్టులో చీర్కపల్లికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వారం రోజుల క్రితం మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాయగా గురువారం ఫలితాలు వెలువరించడంతో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. చీర్కపల్లికి చెందిన ఆరో తరగతి విద్యార్థి శశికిరణ్ గణితంలో మొదటి, ఇంగ్లిష్‌లో రెండో బహుమతి, ఏడో తరగతికి చెందిన గౌతం ఇంగ్లిష్‌లో మూడో ప్రైజ్ సాధించాడు. నాలుగో తరగతి దిశాంత్ గణితంలో, ఇంగ్లిష్‌లో రెండో బహుమతి సాధించాడు.

జాన్‌వెస్లీకి సన్మానం

అమరచింత: సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై న జాన్‌వెస్లీని అమరచింత సీపీఎం నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సత్కరించారు. అమరచింత పట్టణానికి చెందిన జాన్‌వెస్లీ సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అజయ్, శ్యాంసుందర్, వెంకటేష్, జీఎస్ గోపి పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సులు ఆన్‌లైన్‌లోనే పొందాలి

వనపర్తి టౌన్: పట్టణంలోని వివిధ వ్యాపార దుకాణాలు, ఆస్పత్రులు, సినిమా థియేటర్లు వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లు మున్సిపాలిటీ నుంచి విధిగా ట్రేడ్ లైసెన్సులు పొందాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి సూచించారు. ప్రత్యేక అధికారి ఆదేశానుసారం ట్రేడ్ లైసెన్సుల వసూలు చేసేందుకు ఆపరేటర్లు, రెగ్యూలర్ జవాన్లు, సిబ్బందితో రెండు టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు గురువారం ఆ టీంలతో పుర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

సబ్సిడీ కవర్లు సద్వినియోగం చేసుకోవాలి



వీపనగండ్ల: మండలంలో వివిధ గ్రామాల్లో మామిడి తోటలను పెంచే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో మామిడి కాయల పెరుగుదలకు వినియోగించే కవర్లను అందిస్తుందని, అవకాశాన్ని మామిడి రైతులు వినియోగించుకోవాలని మండల ఉద్యావన శాఖ అధికారి కృష్ణ విజ్ఞప్తి చేశారు. 8 వేల కవర్లతో కూడిన సంచులను రూ.9 వేలకే అందజేస్తున్నామన్నారు. బహిరంగా మార్కెట్‌తో పోల్చితే 50 శాతం సబ్సిడీపై కవర్లను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన



తెల్లరాళ్లపల్లిలో విద్యార్థులతో ర్యాలీ

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు తెల్లరాళ్లపల్లి, శాగాపూర్ గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేస్తూ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి వ్యాధి లక్షణాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

వీపనగండ్ల: కుష్టువ్యాధి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారులు రాజశేఖర్, డాక్టర్ శ్వేత అన్నారు. కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంతో పాటు పుల్గర్‌చర్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏఎన్ఎం సునంద, ఆశా వర్కర్లు రేణుక, ఉషారాణి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ప్రజలంతా ఏకమై కుష్టువ్యాధిని తరిమేయాలని డాక్టర్ కృష్ణకుమారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బందితో కుష్టువ్యాధి నివారించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ చాంద్ పాషా, సీహెచ్‌ఓ సిద్దగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో గురువారం కుష్టు వ్యాధి నివారణపై గ్రామస్తులకు ఏఎన్ఎం లక్ష్మమ్మ అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు హనుమాన్‌రావు, కొండన్న, రాజుకుమార్, ఆశావర్కర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.